
సాక్షి
పశ్చిమగోదావరి
శనివారం । 15 । మార్చి । 2025



అక్రమ తవ్వకాలు ఆపేదెవరు?
గ్రామాల్లో టీడీపీ నాయకులు రెచ్చిపోతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే గ్రామస్థాయి నేతలు అక్రమ తవ్వకాలకు పూనుకున్నారు. 8లో ▸



వంతెన నిర్మాణం ప్రశ్నార్థకం
గుండుగొలను వద్ద నిర్మిస్తున్న వంతెన నిర్మాణ పనులు నిలిపివేయాలని కేంద్ర జల రవాణ శాఖ ఆదేశించింది. దీంతో పనులు నిలిచిపోయాయి. 8లో ▸

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ శనివారం (సాయంత్రం)	సహరి ఆదివారం (ఉదయం)
భీమవరం	6.19	4.51
నరసాపురం	6.20	4.51
తాడేపల్లిగూడెం	6.14	4.59

న్యూస్‌రీల్

పోక్సోపై అవగాహన అవసరం



భీమవరంలో పోక్సో చట్టంపై అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న జడ్జి సురేష్‌బాబు

భీమవరం: పోక్సో చట్టంపై అవగాహన కలిగి ఉండాలని భీమవరం ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) జి.సురేష్ బాబు అన్నారు. మండల న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం పోక్సో చట్టంపై అవగాహన కల్పనకు ప్రభుత్వ కళాశాల ఉమెన్స్ హాస్టల్‌లో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రధానంగా 18 ఏళ్లలోపు బాలికలు అపరిచిత వ్యక్తుల పట్ల ఆకర్షితులు కాకుండా జాగ్రత్త వహించాలన్నారు. చదువుపై మాత్రమే దృష్టి పెట్టి అవసరమైన వాటికి మాత్రమే సెల్‌ఫోన్స్ ఉపయోగించాలన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు యేలేటి యోహాన్, ప్యానల్ న్యాయవాదులు బి.సురేష్ కుమార్, ఎన్.సుధీర్, పి.అంబేడ్కర్, బి.లోకేశ్వరరావు, కె.జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

అబద్ధాలు చెప్పడంలో బాబు, లోకేష్ దిట్ట



సమావేశంలో మాట్లాడుతున్న గుడాల గోపి

పాలకొల్లు సెంట్రల్: అబద్ధాలు వల్లించడంలో చంద్రబాబును మించిన ఘనుడు నారా లోకేష్ అని వైఎస్సార్‌సీపీ పాలకొల్లు నియోజకవర్గ ఇంచార్జ్ గుడాల శ్రీహరిగోపాలరావు(గోపి) అన్నారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ అబద్ధాలు వల్లిస్తూనే తండ్రీకొడుకులు రాజకీయాలు చేస్తున్నారన్నారు. తన కుమారుడు దేవాన్ష్‌కు సెల్‌ఫోన్ లేదని, ట్యాబ్ లేదని లోకేష్ చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. తన కొడుక్కే లేవు మీకెందుకని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను కించపరుస్తున్నారా? అని ప్రశ్నించారు. ఓ పక్క తన మనవడు సెల్‌ఫోన్ ఆపరేట్ చేయడంలో గొప్పని చంద్రబాబు చెప్పుకుంటారని, లోకేష్ ఏమో అసలు ఫోనే లేదని చెప్పడం హాస్యాస్పదం అన్నారు. గతంలో జగనన్న ప్రభుత్వం 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లిచ్చి డిజిటల్ విద్యను అందించిందన్నారు. టీడీపీ నాయకులకు గతంలో చంద్రన్న తోఫా, చంద్రన్న పెళ్లికానుక, చంద్రన్న సంక్రాంతి అంటూ సంచులపై ఫొటోలు వేయించుకున్న విషయాలు మర్చిపోయారా చెట్లు, పుట్లపై కూడా రంగులు వేసుకున్న గత విషయాలు గుర్తుకు రావడంలేదా అంటూ ఎద్దేవా చేశారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ కర్రా జయసరిత, జోగి వెంకటేశ్వరరావు, జోగాడ ఉమామహేశ్వరరావు, మామిడిశెట్టి చిట్టిబాబు, అరుణ, కెల్లా పెద్దిరాజు తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారికి వైభవంగా డోలా పౌర్ణమి ఉత్సవం



తొళక్క వాహనంపై క్షేత్ర పురవీధుల్లో ఊరేగుతున్న శ్రీవారు, అమ్మవార్లు

ద్వారకాతిరుమల: చినవెంకన్న దివ్య క్షేత్రంలో శుక్రవారం డోలా పౌర్ణమి ఉత్సవం వేడుకగా జరిగింది. ఈ సందర్భంగా ఉభయ దేవేరులతో శ్రీవారు తొళక్క వాహనంపై క్షేత్ర పురవీధుల్లో ఊరేగారు. ముందుగా ఆలయంలో ఉదయం స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను అర్చకులు తొళక్క వాహనంపై ఉంచి విశేష పుష్పాలంకారాలు చేశారు. అనంతరం ప్రత్యేక పూజలు జరిపి, హారతులిచ్చారు. ఆ తర్వాత శ్రీవారి వాహనం ఆలయ ప్రధాన రాజగోపురం మీదుగా తిరువీధులకు పయనమైంది.

నాగర్‌సోల్‌కు చర్లపల్లిలో మాత్రమే స్టాప్

నరసాపురం: రెండు ప్రధాన ట్రైన్లు ఈ నెల 25 నుంచి సికింద్రాబాద్‌లో ఆపకుండా చర్లపల్లిలో మాత్రమే ఆపాలని నిర్ణయించింది. 12787, 12788 నరసాపూర్ -నాగర్‌సోల్ ఎక్స్‌ప్రెస్, 17231, 17232 నరసాపూర్ సూపర్ ఫాస్ట్ రైళ్లు ఈ నెల 25 నుంచి సికింద్రాబాద్‌లో ఆగకుండా చర్లపల్లి, మౌలాలి మీదుగా నడుస్తాయని నరసాపురం రైల్వేస్టేషన్ మేనేజర్ మధుబాబు చెప్పారు. చర్లపల్లిలో దిగి సికింద్రాబాద్‌కు రావాలంటే మళ్లీ వెనక్కి ప్రయాణించాలి. నాగర్‌సోల్ ఎక్స్‌ప్రెస్ ద్వారా పెద్దసంఖ్యలో పగటిపూట హైదరాబాద్ ప్రయాణాలు చేస్తున్నారు.

మీ అవగాహనే బ్రహ్మాస్త్రం

- వస్తువుల నాణ్యత, సేవల్లో లోపాలకు చెక్
- వినియోగదారుల ఫోరంలో ఫిర్యాదుతో అక్రమాలకు అడ్డుకట్ట
- నేడు అంతర్జాతీయ వినియోగదారుల హక్కుల దినోత్సవం





మనం కొనే వస్తువు, అందించే సేవలో ఏదైనా లోపం ఉంటే న్యాయం పొందే హక్కు వినియోగదారుడికి ఉంటుంది. సరైన ధర, తూకం, నాణ్యత, స్వచ్ఛత కలిగిన వస్తువులు లేదా సేవలు పొందడం వినియోగదారుడి ప్రాథమిక హక్కు. ఇటీవల కాలంలో వస్తువుల్లో నాణ్యతా లోపాలు, తూకాల్లో మోసాలు, సేవల్లో నిర్లక్ష్యం వంటివి ఎక్కువై పోయాయి. తాగే పాలు, నీళ్లను కూడా కల్తీ చేస్తున్నారు. సామాన్యుడు వీటిని ప్రశ్నించలేక ఎక్కడికక్కడ సర్దుకుపోతున్నాడు. ఈ తరహా మోసాలను అరికట్టేందుకు వినియోగదారుడు మేల్కొనాలి. అందుకే ఏటా మార్చి 15న అంతర్జాతీయ వినియోగదారుల హక్కుల దినోత్సవంగా నిర్వహిస్తున్నారు.

భీమవరం/ఆకివీడు/భీమవరం(ప్రకాశం చౌక్) : ఇటీవల జిల్లాలో తూనికలు, కొలతల్లో వ్యాపారుల మోసం ఎక్కువైంది. వినియోగదారులు నష్టపోతున్నా ప్రభుత్వం పట్టించుకుంటున్న దాఖలాలు లేవు. ఇప్పుడు ఎలక్ట్రానిక్ కాటాలు రావడంతో మోసం చేసేవారికి మరింత సులువైంది. నిత్యావసరాలు, కూరగాయాలు, చికెన్, మటన్ వంటివే గాకుండా రైతుల వద్ద వ్యాపారులు కొనుగోలు చేసే ధాన్యం, చేపలు, రొయ్యల తూకాల్లో మోసాలకు పాల్పడుతున్నారు. తూకాల్లో మోసాలపై వినియోగదారుల సంఘాలు అధికారులకు ఫిర్యాదు చేస్తున్నా మొక్కుబడిగా తనిఖీలు చేస్తున్నారు. చర్యలు లేకపోవడంతో కొంతమంది వ్యాపారులు మోసమే ధ్యేయంగా తమ కార్యకలాపాలు సాగిస్తున్నారు. కిలోకు దాదాపు 100 గ్రాముల తక్కువ బరువుతో వినియోగదారుడిని మోసగిస్తున్నారు. తక్కెడకు వినియోగించే కిలో, అర కిలో రాళ్లను తూనికలు, కొలతల అధికారులు నిత్యం పర్యవేక్షించాల్సి ఉన్నా పట్టించుకోకపోవడంతో కొంతమంది వ్యాపారులు రాళ్లను అరగదీయడం, లోపల కన్నాలు పెట్టి పైన పూత వేయడం వంటి మోసాలకు పాల్పడుతున్నారు. ఎలక్ట్రానిక్ కాటాలు తయారుచేసే కంపెనీలు సక్రమంగా బరువువచ్చేలా ఏర్పాటుచేస్తున్నా వాటిని కూడా వ్యాపారులు తమకు అనుకూలంగా సెట్ చేస్తున్నట్లు చెబుతున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో 90 శాతం ఎలక్ట్రానిక్ కాటాలను ఉపయోగిస్తున్నా వాటి చిప్‌లు మార్పులు చేసి తూకంలో మోసం చేస్తున్నారు.

పెట్రోల్ బంకుల్లో మోసాలు

పెట్రోల్ కంపెనీలు డీలర్లుకు బంక్‌లను లీజుకు ఇచ్చి నిర్వహణ చేస్తుంటాయి. కొందరు డీలర్లు పెట్రోల్, డీజిల్ పంపులకు ఉండే డిజిటల్ మిషన్‌లో కంపెనీలకు తెలియకుండా మార్పులు, చేర్పులు చేసి వినియోగదారురులను మోసగిస్తున్నాయి. స్వీట్ షాపు యజమానులు తూనికల్లో మోసం చేస్తున్నారు. వినియోగదారులకు కేవలం స్వీట్ మాత్రమే తూకం వేయాల్సివుండగా స్వీట్స్ పెట్టే బాక్స్‌లను సైతం తూకం వేసి విక్రయిస్తున్నారు.

మాంసం విక్రయాల్లో అక్రమాలు

మాంసం విక్రయాల్లోను వినియోగదారుడు మోసానికి గురువుతున్నారు. మిగిలిన మాంసాన్ని ఫ్రిజ్‌లో పెట్టి మరుసటి రోజు విక్రయిస్తున్నారు. నిల్వ మాంసం తినడం వల్ల అనేక మంది అనారోగ్యానికి గురై ఆసుపత్రుల పాలవుతున్నారు. అడపాదడపా మున్సిపల్ కమిషనర్లు, పంచాయతీ కార్యదర్శులు దాడులు చేసి నిల్వ మాంసాన్ని సీజ్ చేయడం మినహా పెద్దగా చర్యలు లేకపోవడంతో వ్యాపారులు భయపడుతున్న దాఖలాలు లేవు.

నామమాత్రంగా వినియోగదారుల సంఘాలు

వినియోగదారులు మోసపోకుండా నిత్యం అవగాహన కల్పించి వారికి అండగా ఉండాల్సిన వినియోగదారుల సంఘాలు నామమాత్రంగానే పనిచేస్తున్నాయి. గత ఏడాది కాలంగా వినియోగదారుల సంఘం జిల్లా వ్యాప్తంగా ఒక్క కేసు కూడా నమోదు చేయించలేదంటే వాటి పనితీరు అవగతమవుతోంది. ప్రభుత్వ పరంగా విజిలెన్స్ కమిటీలు ఏర్పాటు చేసినా తరచు సమావేశాలు ఏర్పాటు చేయకపోవడంతో కమిటీలు ఉత్సవ విగ్రహాలుగా మిగిలిపోతున్నాయి.

వినియోగదారుల రక్షణ ఇలా..

వినియోగదారుల చట్టం బ్రహ్మాస్త్రంగా ఉపయోగపడుతుంది. 1986లో తీసుకొచ్చిన వినియోగదారుల చట్టానికి 2019లో చేసిన సవరణలతో ఈ చట్టానికి విశేష అధికారాలు వచ్చాయి. జరినామాతో పాటు జైలుకు కూడా పంపొచ్చు. వస్తువు ఎక్కడ కొనుగోలు చేసినా.. ఎక్కడి నుంచైనా ఫిర్యాదు చేయొచ్చు. కేవలం తెల్లకాగితంపై ఫిర్యాదు రాసి వినియోగదారుల ఫోరంలో సమర్పించవచ్చు. జిల్లా స్థాయిలో వినియోగదారుల కమిషన్ ఉండటంతో పాటు దీని పరిధిలో అధ్యక్షుడు, ఇద్దరు సభ్యులు ఉంటారు. ఈ కమిషన్‌కు సాధారణ కోర్టు జడ్జికి ఉండే అధికారాలు ఉంటాయి.

వినియోగదారుల హక్కుల కోసం పోరు

గతంలో జిల్లా వినియోగదారుల సమాఖ్య జిల్లా అధ్యక్షుడిగా పనిచేసిన ఆకివీడుకు చెందిన బొబ్బిలి బంగారయ్య మోసపోయిన వినియోగదారులతో కోర్టులో కేసులు వేయించి అనేక విజయాలు సాధించారు. ఆకివీడులో 1989 సెప్టెంబర్ 9న ఆయన వినియోగదారుల సంఘాన్ని ఏర్పాటుచేశారు. ఎంతో మందికి వినియోగదారుల హక్కుల పట్ల అవగాహన కల్పించమేగాక జిల్లా వ్యాప్తంగా ఎన్నో సంఘాల్ని ఏర్పాటు చేయించారు. 20 ఏళ్ల క్రితం టెలిఫోన్ బిల్లుల పెంపుపై పోరాటం చేసి రెంటల్‌ను రూ.180 నుంచి రూ.110కు తగ్గించేలా చేయించారు. వంట గ్యాస్ కోసం క్యూ విధానానికి స్వస్తి చెప్పి బుకింగ్ విధానం అమలు చేయించగలిగారు. ప్రకృతి వైపరీత్యాల కారణంగా దెబ్బతిన్న పంటలకు పంటల బీమా వర్తించకపోవడంతో పోరాటం చేసి ఆకివీడు, తాడేపల్లిగూడెం ప్రాంతాల్లోని 700 మంది రైతులకు దాదాపు రూ.3 కోట్ల నష్టపరిహారం ఇప్పించగలిగారు. అడవికొలను సొసైటీ చానమిల్లి రైతులకు పంటల బీమా మంజూరు చేయించకపోవడంతో వినియోగదారుల సంఘం తరపున పోరాడి 90 మంది రైతులకు రూ.10 లక్షలు నష్టపరిహారం ఇప్పించగలిగారు.



బొబ్బిలి బంగారయ్య

పోలీసుల దిగ్బంధంలో తణుకు

- సీఎం పర్యటనతో ఎన్నడూ లేని విధంగా భద్రత
- పట్టణంలో అడుగడుగునా ఆంక్షలు



తణుకు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల వద్ద పోలీసుల బందోబస్తు

తణుకు అర్బన్: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పర్యటనలో భాగంగా ఆంక్షలు, నిర్బంధాల మధ్య తణుకు పట్టణం వేడెక్కింది. శుక్రవారం పట్టణ ప్రాంతం పూర్తిగా పోలీసుల ఆధీనంలోకి వెళ్లిపోయింది. తణుకు రాష్ట్రపతి రోడ్డు, పెరవలి రోడ్డు, ఉండ్రాజవరం రోడ్డు, సొసైటీ రోడ్డుల్లో పోలీసుల భద్రత కట్టుదిట్టం చేశారు. నిరంతరం పోలీసు సైరన్‌లతో పట్టణ ప్రాంతం మార్మోగిపోయింది. తాడేపల్లిగూడెం, భీమవరం మున్సిపాలిటీల నుంచి పారిశుద్ధ్య కార్మికులను రప్పించి పారిశుద్ధ్య నిర్వహణ చేయిస్తున్నారు.

గతంలో ఎన్నడూ లేనివిధంగా..

గతంలో తణుకు ప్రాంతానికి అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తణుకు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సమావేశానికి హాజరైనప్పటికీ ప్రజలపై ఎలాంటి ఆంక్షలు, ఇబ్బందులు లేకుండానే పర్యటన నిర్వహించారు. నేడు ఇంత భద్రత, ఇన్ని రకాల ఆంక్షలు ఏంటనేది ప్రజల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ముఖ్యంగా రాష్ట్రపతి రోడ్డులో అడుగడుగునా పోలీసు అధికారులు, కానిస్టేబుళ్లు బందోబస్తు నిర్వహిస్తుండగా పర్యవేక్షణకు ఉన్నతాధికారులు వాహనాల్లో తిరుగుతున్నారు. శనివారం చంద్రబాబు పర్యటన కారణంగా పాఠశాలలు, కళాశాలలు మూసివేయాలని విద్యాశాఖాధికారుల నుంచి ఆదేశాలివ్వగా, దుకాణదారులకు సైతం తమ దుకాణాలు మూసివేయాలని, సమావేశాలు నిర్వహించే ప్రాంతాల్లోని ఇళ్లలో సైతం కొత్త వారిని ఎవరినీ రానివ్వద్దని పోలీసులు ఆంక్షలు విధించడం ఆశ్చర్యం కలిగిస్తుందని ప్రజలు చెబుతున్నారు. శుక్రవారం తణుకులో సీఎం పర్యటన వ్యవహారాలకు సంబంధించి మంత్రి నిమ్మల రామానాయుడు ఇతర ఎమ్మెల్యేలు పనులను పర్యవేక్షించారు.

హైవేపై ఘోర ప్రమాదం

ఆగి ఉన్న లారీని ఢీకొన్న కారు.. ముగ్గురు మృతి



తాడేపల్లిగూడెం మండలం కుంచనపల్లి వద్ద జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదం

తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెం మండలం కుంచనపల్లి వద్ద జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం ముగ్గురు మృతిచెందాడు. ఆగి ఉన్న లారీని వెనుక నుంచి కారు ఢీకొనడంతో ఈ ఘోరం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని ఒక ఐటీ కంపెనీకి చెందిన హెచ్‌ఆర్ విభాగం ఉద్యోగి భోగెల్లి వెంకట సత్య సురేన్ (37), ఆయన భార్య నవ్య (35), కుమార్తె వాసకి కృష్ణ (5), బంధువు శ్రీరమ్య శాంత్రో కారులో తూర్పు గోదావరి జిల్లా ఏడిద గ్రామంలో జరగనున్న విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమానికి బయల్దేరారు. శుక్రవారం మధ్యాహ్నం 12.45 గంటల ప్రాంతంలో తాడేపల్లిగూడెం మండలం కుంచనపల్లి వద్ద జాతీయ రహదారిపైకి వచ్చేసరికి సురేన్ డ్రైవ్ చేస్తున్న కారు జాతీయ రహదారి మెయింటెనెన్స్ పనులు చేస్తున్న లారీని వెనుక నుంచి బలంగా ఢీకొంది. దీంతో సత్య సురేన్, నవ్యలు అక్కడికక్కడే మృతి చెందగా, కుమార్తె వాసకి కృష్ణ (5), బంధువు శ్రీరమ్యను తణుకు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ వాసకి కృష్ణ మృతి చెందగా, శ్రీరమ్యను మెరుగైన వైద్యం కోసం రాజమహేంద్రవరంలోని బొల్లినేని ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న రూరల్ ఏఎస్సై పీవీకే.దుర్గారావు వివరాలు సేకరించారు. మృతదేహాలను తాడేపల్లిగూడెం ఏరియా ప్రభుత్వాసుపత్రికి తరలించి, రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. నిద్ర మత్తు వల్ల ఈ ప్రమాదం జరిగినట్లు భావిస్తున్నారు.



సత్యసురేన్ (ఫైల్)

మండపేటలో విషాద ఛాయలు

ఈ ప్రమాదంలో తూర్పు గోదావరి జిల్లా మండపేట పట్టణంలో విషాదఛాయలు అలముకున్నాయి. సత్య సురేన్ తండ్రి పాపారావు రిటైర్డ్ ఉద్యోగి. ఈ ఘటనలో పాపారావు చెల్లెలు కుమార్తె ఉప్పలూరి శ్రీరమ్యకు తీవ్ర గాయాలయ్యాయి. యూఎస్‌లో ఉంటున్న ఆమె ఇటీవల గృహ ప్రవేశ శుభకార్యానికి హైదరాబాద్ వచ్చారు. ఒకే కుటుంబంలో ముగ్గురిని మృత్యువు కాటేయడంతో కుటుంబ సభ్యులు జీర్ణించుకోలేకపోతున్నారు.

వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల్లో నలుగురి నియామకం

భీమవరం: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్ర అనుబంధ విభాగ కమిటీల్లో జిల్లాకు చెందిన పలువురిని వివిధ హోదాల్లో నియమించారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. రాష్ట్ర సోషల్ మీడియా వింగ్ సెక్రటరీగా బొగ్గు జయరాం, రాష్ట్ర మైనార్టీ సెల్ సెక్రటరీలుగా షేక్ వలీ, షేక్ రబ్బాని, రాష్ట్ర మైనార్టీ సెల్ అధికార ప్రతినిధిగా షేక్ బులిమస్తాన్‌ను నియమించారు.

బాలల చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

ఏలూరు (టూటౌన్): బాలల చట్టాలపై ప్రతిఒక్కరూ అవగాహన పెంచుకోవాలని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యుడు డాక్టర్ రాజేంద్రప్రసాద్ సూచించారు. ఏలూరు వన్‌టౌన్ ఏరియాలో ఉన్న హోటల్ ఆదిత్య సెంట్రల్‌లో చైల్డ్ రైట్స్ అడ్వకసీ ఫౌండేషన్ – క్రాఫ్ ఆధ్వర్యంలో బాలలతో ముఖాముఖీ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ముఖ్య అతిథి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ క్రాఫ్ సిబ్బంది బాలల న్యాయ చట్టాల గురించి వివరించడమే కాకుండా బాలల సమస్యలను గుర్తించి అధికారులకు తెలియజేసేలా ప్రోత్సహించడం మంచి ఆలోచన అన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్న ప్రసాద్ మాట్లాడుతూ గ్రామ స్థాయిలో బాలల దగ్గర నుంచి పెద్దవారి వరకు ఏ విధమైన ఉచిత న్యాయ సలహాలు కావాలన్నా మండల స్థాయిలో మండల లీగల్ సర్వీస్ అథారిటీ, జిల్లా స్థాయిలో జిల్లా న్యాయ సేవా అధికార సంస్థను సంప్రదించాలన్నారు.

ఆగని పశువధ



పశువధ ఫ్యాక్టరీ ప్రాంతంలో దుర్వాసనతో ముక్కుకు క్లాత్ కట్టుకున్న పోలీసులు (ఫైల్)



పైడిపర్రులో రూరల్ పోలీస్‌స్టేషన్ వద్ద రోడ్డుపై బైఠాయించిన ఫ్యాక్టరీ బాధిత మహిళలు (ఫైల్)

- రాజకీయ అండతో అక్రమంగా కొనసాగుతున్న ఫ్యాక్టరీ
- మద్దతుగా అధికారులు, పోలీసులు
- పవన్‌కల్యాణ్‌ను ఆశ్రయించినా ఆగని వైనం
- సీఎం చంద్రబాబుకు తెలియాలంటూ సోషల్ మీడియాలో పోస్టులు వైరల్..
- మేము కావాలా... ఫ్యాక్టరీ కావాలో తేల్చుకోమంటున్న బాధితులు

తణుకు అర్బన్: ఆడబిడ్డల ఆర్తనాదాలు, కన్నీళ్లు, రోడ్డుపై బైఠాయింపులు ఇలా ఎన్ని ప్రయత్నాలు చేసినా తణుకు మండలం తేతలి గ్రామ పరిధిలో లాహం ఫుడ్ ప్రొడక్ట్స్ పేరుతో నిర్వహిస్తున్న పశువధ శాలకు అడ్డుకట్ట వేయలేకపోయారు. పశువధ కారణంగా ఆ ప్రాంతంలో ఇళ్లలో ఉండలేకపోతున్నామని, ఇళ్లలో భోజనాలు కూడా చేయలేకపోతున్నామని స్థానికులు రోడ్డెక్కినా కూటమి ప్రభుత్వ కనుసన్నల్లో సాగుతున్న ఈ ఫ్యాక్టరీ యథేచ్ఛగా కొనసాగుతోంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఐదేళ్ల పాటు ఎలాంటి పశువధ నిర్వహించలేదని కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత మూడు నెలలుగా ఫ్యాక్టరీ ప్రాంతంలో నివాసితులు ఉండ లేకపోతున్నారని అంటున్నారు. ఓట్లేసిన మేం కావాలో లేక వేరే రాష్ట్రం నుంచి వచ్చిన ఫ్యాక్టరీ యాజమాన్యం కావాలో తేల్చుకోమని స్థానిక మహిళలు తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణకు సవాల్ విసిరారు. అయినప్పటికీ ఎటువంటి చలనం లేదు. పశువధపై మొదటి నుంచి మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు వ్యతిరేకంగా ఉంటూ బాధితులకు అండగా నిలిచారు. ప్రస్తుతం న్యాయస్థానం ద్వారా అడ్డుకునేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేశారు.

సోషల్ మీడియాలో వైరల్

తణుకులో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు శనివారం పర్యటన నేపథ్యంలో పశువధ శాలకు వ్యతిరేకంగా నిర్ణయం తీసుకోవాలని, నిర్ణయం తీసుకునేలా స్థానిక ఎమ్మెల్యే కృషి చేయాలంటూ గో సేవాసమితి, పశు సంరక్షకులు పోస్టులు పెడుతూ వైరల్ చేస్తున్నారు. ఈ సమస్య మళ్లీ వేడెక్కడంతో పశువధ శాలపై తణుకు వాసుల్లో చర్చ మొదలైంది. పశువధ శాల వ్యవహారాన్ని చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లాలని బాధిత మహిళలు ప్రయత్నిస్తున్నారు.

అక్రమమని తేల్చినా..

2019 టీడీపీ హయాంలో పుట్టుకొచ్చిన ఈ పశువధ శాలకు ఉన్న అనుమతులు అక్రమమని తణుకు తహసీల్దారు సమక్షంలో తేల్చినా కొనసాగుతుండడం బాధాకరమని బాధితులు వాపోతున్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వ హయాంలో పశువులను వధించడం మొదలుపెట్టిన వెంటనే వచ్చిన దుర్వాసనకు స్థానిక ప్రజలు రోడ్డెక్కారు. ధర్నాలు, నిరసనలు చేశారు. ఫ్యాక్టరీకి పొలిచ్చే గేదెలతో వస్తున్న వ్యాన్‌లు నిలుపుదల చేసి పోలీసులకు అప్పగించారు. ఆపై శాంతియుతంగా నిరసన దీక్ష, వంటవార్పు కార్యక్రమాలు నిర్వహించారు. అయితే పోలీసులు 144 సెక్షన్ పెట్టి టెంట్లు కూల్చివేశారు. పోలీసు పికెటింగ్‌లో ఏకధాటిగా పశువధ కొనసాగింది. దీంతో తేతలి, తణుకు ప్రాంతం రాజకీయంగా వేడెక్కింది. అయినప్పటికీ ఫ్యాక్టరీ నడుస్తుండడంతో గోసేవాసమితి, గోసంరక్షకులు న్యాయస్థానాన్ని ఆశ్రయించి స్టే తీసుకువచ్చినా ఇటీవల తిరిగి స్టే వెకేట్ అయి తిరిగి పశువధ మొదలైంది.

టీడీపీ, జనసేన కేంద్ర కార్యాలయాలకు వెళ్లినా..

తేతలిలో నిర్వహిస్తున్న పశువధ కారణంగా ఇళ్లలో ఉండలేకపోతున్నామని, పిల్లలకు రకరకాల ఆరోగ్య సమస్యలు వస్తున్నాయంటూ చివరి ప్రయత్నంగా మంగళగిరిలోని టీడీపీ, జనసేన కేంద్ర కార్యాలయాలకు వెళ్లి వినతులు ఇచ్చినా, ఇటీవల ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను బాధితులు రోడ్డుపై కలిసి సమస్య కాగితాల రూపంలో ఇచ్చినా ఇంతవరకు ఎలాంటి పరిష్కారం దొరకలేదు. అయినా పశువధ కొనసాగడంపై బాధితులు ఆందోళన చెందుతున్నారు.

కేంద్రీయ విద్యాలయం స్థలం పరిశీలన

నూజివీడు: కేంద్రీయ విద్యాలయానికి ట్రిపుల్ ఐటీ సమీపంలో గత ప్రభుత్వం కేటాయించిన ఏడెకరాల స్థలాన్ని శుక్రవారం కేంద్రీయ విద్యాలయానికి చెందిన అధికారులు పరిశీలించారు. కేంద్రీయ విద్యాలయం ఏలూరు ప్రిన్సిపాల్ బీఎస్ మీనా, ఈఈ కిశోర్, డీఈ కృష్ణమోహన్ నూజివీడు విచ్చేసి మున్సిపల్ కమిషనర్ ఆర్.వెంకట రామిరెడ్డితో వెళ్లి పరిశీలించారు. స్థలంలో ఉన్న పిచ్చి చెట్లు, ముళ్లకంపను తొలగించాలని మున్సిపల్ కమిషనర్‌కు తెలిపారు. ఎలాంటి ముళ్ల చెట్లు లేకుండా అప్పగిస్తే అందులో శాశ్వత భవనాల నిర్మాణానికి ముందడుగు పడుతుందన్నారు.

క్లుప్తంగా

గుబ్బల మంగమ్మ తల్లి జాతర ప్రారంభం



మంగమ్మతల్లి గుడికి పోటెత్తిన భక్తులు

బుట్టాయగూడెం : మండంలోని కామవరం సమీపంలో దట్టమైన అటవీలో కొలువై ఉన్న గుబ్బల మంగమ్మతల్లి జాతర మహోత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. గురుజీ వర్మా పుల్లారావు ఆధ్వర్యంలో గణపతి విశేష పూజలు, పాలాభిషేకం పూజా కార్యక్రమాలు ఆదివాసీ సాంస్కృతిక, సంప్రదాయాల ప్రకారం విశేష పూజలు చేశారు. జాతర సందర్భంగా డోలు వాయిద్యాల దరువులతో కొండలు దద్దరిల్లాయి. మరో రెండు రోజులు మంగమ్మతల్లి జాతర మహోత్సవాలు జరగనున్నాయి. మొదటి రోజు ఉత్సవాల్లో స్థానిక నాయకులు ప్రత్యేక పూజలు చేశారు. సుమారు 4 వేలు మందికి పైగా ఏపీ, తెలంగాణా రాష్ట్రాల్లోని పలు జిల్లాల నుంచి భక్తులు అమ్మ వారిని దర్శించుకున్నట్లు ఆలయ కమిటి ప్రతినిధి, సర్పంచ్ కోర్స గంగరాజు తెలిపారు.

కాలుజారి కాలువలో పడి మహిళ మృతి



జోగినీడి లక్ష్మి (ఫైల్)

భీమడోలు: మండలంలోని పూళ్ల వద్ద శుక్రవారం తెల్లవారుజామున గోదావరి కాలులో కాలుజారి ప్రమాదవశాత్తు కోడూరుపాడుకు చెందిన మహిళ జోగినీడి లక్ష్మి(59) మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కోడూరుపాడుకు చెందిన జోగినీడి లక్ష్మి ప్రతి శుక్రవారం పూళ్లలోని గోదావరి కాలువలో స్నానం చేసి రేవు వద్ద ఉన్న గుళ్లల్లో చేస్తుంది. ఈ క్రమంలో రోజు మాదిరిగానే తెల్లవారుజామున భర్తతో గోదావరి స్నానానికి వెళ్తున్నట్లు చెప్పి వెళ్లింది. అయితే ఉదయం 8 గంటల కూడా ఇంటి రాకపోవడంతో భర్త గోదావరి కాలువ దగ్గరికు వచ్చి చూడగా లక్ష్మీ చెప్పులు కనబడగా స్థానికుల సహాయంతో కాలువలో గాలించగా లక్ష్మీ మృతదేహం బయటపడింది. భర్త వెంకటేశ్వరరావు ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వై.సుధాకర్ తెలిపారు.

ఆటో-లారీ ఢీ

ఒకరికి తీవ్రగాయాలు



ప్రమాదంలో దెబ్బతిన్న ఆటో

గణపవరం: మండలంలోని వరదరాజపురం గ్రామ శివారున లారీ ఆటోను ఢీకొన్న ప్రమాదంలో ఆటోడ్రైవర్‌కు తీవ్రగాయాలయ్యాయి. గురువారం రాత్రి పిప్పర వైపు నుంచి వరదరాజపురం వస్తున్న ఖాళీ ఆటోను పిప్పరవైపు వెళ్తున్న లారీ ఢీకొట్టింది. ఈప్రమాదంలో ఆటో తీవ్రంగా దెబ్బతినగా ఆటో డ్రైవర్ కర్రిశ్రీను తలకు తీవ్రంగా గాయం కావడంతో అతనిని తాడేపల్లిగూడెంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. లారీ డ్రైవర్ లారీని అక్కడే వదిలి పరారయ్యాడు. వరదరాజపురం గ్రామానికి చెందిన కర్రి శ్రీను ఇంటికి కూతవేటు దూరంలోనే ఈ ప్రమాదం సంభవించడంతో వెంటనే స్థానికులు వచ్చి క్షతగాత్రుడిని ఆస్పత్రికి తరలించారు.

అక్రమ తవ్వకాలను ఆపేదెవరు?

- కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా స్పందన నిల్
- సత్తాల చెరువులో కొనసాగుతున్న అక్రమ తవ్వకాలు



సత్తాల చెరువులో జరుగుతున్న మట్టి అక్రమ తవ్వకాలు



అక్రమ తవ్వకాలు కారణంగా భారీగా ఏర్పడిన గుంత

ద్వారకాతిరుమల: ఎడాపెడా ఏది చేసినా..అడిగేదెవడ్రా నా ఇష్టం అని గ్రామాల్లో టీడీపీ నాయకులు రెచ్చిపోతున్నారు. ముఖ్యంగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే గ్రామస్థాయి నేతలు ఆయా గ్రామాల్లోని చెరువుల్లో అక్రమ తవ్వకాలకు పూనుకుంటున్నారు. మండలంలోని సత్తాల గ్రామంలో ఓ టీడీపీ నాయకుడు అక్రమ మట్టి తవ్వకాలకు తెరతీశాడు. టీడీపీ నేత మట్టి అక్రమ దందాపై సత్తాల గ్రామ ప్రజలు రెండు రోజుల క్రితం జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. అయినా వాటిని లెక్కచేయకుండా ఆ నాయకుడు తన పనిని దర్జాగా సాగిస్తున్నాడు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి మండలంలోని సత్తాల గ్రామంలో ఆర్ఎస్ నెంబర్ 205 లో 32.48 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న సత్తాల (ఇరిగేషన్) చెరువులో మట్టి అక్రమ తవ్వకాలు యథేచ్ఛగా జరుగుతున్నాయి. స్థానిక టీడీపీ నాయకుడు 'రాజు'లా ఆ పార్టీ పెద్దల అండదండలతో ఈ దందాను కొనసాగిస్తున్నాడు. ఒక్కో టిప్పర్ మట్టిని రూ. 5 వేల నుంచి రూ. 10 వేలకు వివిధ ప్రాంతాలకు విక్రయిస్తూ జేబులు నింపుకుంటున్నాడు. ఇదేంటని ఎవరైనా ప్రశ్నిస్తే ఆ నాయకుడు దౌర్జన్యం చేస్తూ, బూతులు తిడుతున్నాడని స్థానికులు చెబుతున్నారు.

చెరువు నిండా గుంతలే

అక్రమ తవ్వకాలు కారణంగా చెరువులో 10 నుంచి 15 అడుగుల లోతు గుంతలు ఏర్పడ్డాయని, వాటి వల్ల ప్రమాదాలు సంభవిస్తున్నాయని గ్రామస్తులు వాపోతున్నారు. మట్టి రవాణా కారణంగా గ్రామంలోని రహదారులు సైతం ధ్వంసం అవుతున్నాయని ఆరోపిస్తున్నారు. మండల స్థాయి అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా పట్టించుకోలేదని వాపోయారు. రాత్రి, పగలు అనే తేడా లేకుండా జరుగుతున్న ఈ అక్రమ మట్టి తవ్వకాలపై ఈ నెల 12 న జిల్లా కలెక్టర్‌కు, అలాగే మైనింగ్, పోలీస్ అధికారులకు ఫిర్యాదు చేసినట్టు గ్రామస్తులు తెలిపారు. అయినా ఇప్పటివరకు ఈ మట్టి దందాకు అడ్డుకట్ట పడకపోవడం దారుణమని మండిపడుతున్నారు. అధికార పార్టీ నాయకుడికి భయపడి అధికారులెవరూ ఆ వైపు కన్నెత్తి చూడటం లేదని స్పష్టం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సత్తాల చెరువులో అక్రమ మట్టి తవ్వకాలు ద్వారా పోగేసిన సొమ్మును టీడీపీ నాయకుడి నుంచి రికవరీ చేసి, ప్రభుత్వానికి జమ చేయాలని పలువురు కోరుతున్నారు.

ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు



సత్తాల చెరువులో జరుగుతున్న మట్టి దందాకు అడ్డుకట్ట వేయాలని జిల్లా కలెక్టర్‌కు, ఇతర అధికారులకు కొంత మంది గ్రామస్తులతో కలిసి ఫిర్యాదు చేశాం. ఇప్పటి వరకు ఎవరూ పట్టించుకోలేదు. అధికార పార్టీ నేతలు, అధికారుల అండదండలతోనే ఈ దందా సాగుతోంది.

– కుంచే రాజేష్, సత్తాల గ్రామస్తుడు

ఇంత దారుణమా..?



పట్టపగలు ఇష్టానుసారం చెరువును తవ్వేస్తుంటే పట్టించుకునే నాథుడు లేడు. ముడుపులు అందాయో, లేక అధికార పార్టీ నాయకులకు భయపడ్డారో? తెలియదు గానీ మట్టి అక్రమ తవ్వకాలను మాత్రం ఎవరూ అడ్డుకోవడం లేదు. ఇంత దారుణం ఎప్పుడూ చూడలేదు.

– పుల్లా అచ్చియ్య, సత్తాల గ్రామస్తుడు

బతుకుతెరువు కోసం వెళ్లి తిరిగిరాని లోకాలకు



శివకృష్ణ (ఫైల్)



వరప్రసాద్ (ఫైల్)

కాళ్ల: బతుకుతెరువు కోసం వెళ్లి ఘోర రోడ్డు ప్రమాదంలో మండలానికి ఇద్దరు వ్యక్తులు మరణించారు. మండలంలోని ప్రాతాళ్ళమెరక గ్రామానికి చెందిన కోటి వెంకట వరప్రసాద్(54) తన బొలెరో వ్యాన్‌లో కిరాయికి రొయ్యలు పిల్లలు తేవడానికి ఆఫ్టింగ్ డ్రైవర్‌గా వెళ్లే జువ్వలపాలెం గ్రామానికి చెందిన చీపురుపల్లి శివకృష్ణ (29) తీసుకుని గురువారం రాత్రి కృష్ణా జిల్లా అవనిగడ్డ ప్రాంతం వెళ్లారు. శుక్రవారం తెల్లవారుజామున రొయ్యపిల్లలు వ్యాన్ లో తీసుకుని చల్లపల్లి మీదుగా వస్తుండగా ఘంటసాల మండలం జీలగలగండి గ్రామ పరిధిలో దురదృష్టవశాత్తు ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో ఇద్దరూ అక్కడికక్కడే దుర్మరణం చెందారు. దీంతో రెండు గ్రామాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. శివకృష్ణకు ఇంకా వివాహం కాలేకపోవడంతో, అందరితో కలిసి తిరిగే మిత్రుడు మరణవార్త తెలియడంతో స్నేహితులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు.

జలాశయంలో దూకి మహిళ ఆత్మహత్య



తేజస్విని (ఫైల్)



జలాశయం నుంచి బయటకు తీసిన మృతదేహాన్ని చూసి రోదిస్తున్న బంధువులు

బుట్టాయగూడెం: భర్తతో గొడవ జరగడంతో మనస్థాపం చెందిన భార్య జలాశయంలోకి ఆత్మహత్య చేసుకున్న ఘటన శుక్రవారం మండలంలోని చింతలగూడెంలోని పోగొండ రిజర్వాయర్ వద్ద జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని ఇనుమూరుకు చెందిన తేజస్విని ఇదే మండలం సీతప్పగూడేనికి చెందిన రవితేజ ఇద్దరూ సంవత్సరం పాటు ప్రేమించుకుని వివాహం చేసుకున్నారు. అయితే ఇటీవల వీరిద్దరూ తరచూ గొడవపడుతున్నారు. అయితే గురువారం కూడా భార్యభర్తలిద్దరూ గొడవపడ్డారు. తీవ్ర మనస్థాపం చెందిన తేజస్విని గురువారం సాయంత్రం సమయంలో ఇంటి నుంచి వెళ్లిపోయింది. అయితే శుక్రవారం ఉదయం తేజస్విని మృతదేహం పోగొండ రిజర్వాయర్‌లో పైకి తేలి ఉన్నట్లు తెలుసుకున్న తేజస్విని తరఫు బంధువులు లబోదిబోమంటూ అక్కడకు చేరుకున్నారు. తల్లి బేలం దుర్గమ్మ ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు అక్కడికి వెళ్ళి మృతదేహాన్ని వెలికితీశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. కాగా మృతి చెందిన తేజస్విని, రవితేజ దంపతులకు 7 నెలల పాప ఉంది.

ఈ ఆక్రమణలపై అంత ప్రేమ ఎందుకు?



ఎన్నార్పీ అగ్రహారంలో ఆక్రమణలు పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

ఉండి: పేదోడిపై ప్రతాపం, ధనవంతుడిపై ప్రేమ కురిపిస్తున్న ఎమ్మెల్యే, డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామకృష్ణరాజుకు పారిశ్రామికవేత్త రంగరాజు ఆక్రమణలపై అంత ప్రేమ ఎందుకు? అని సీపీఎం జిల్లా కార్యదర్శి జేఎన్వీ గోపాలన్ మండిపడ్డారు. శుక్రవారం ఎన్నార్పీ అగ్రహారంలో నిర్వహించిన సైకిల్‌యాత్రలో గ్రామ ప్రజలు రంగరాజు ప్రభుత్వ భూముల ఆక్రమణలను నాయకుల దృష్టికి తీసుకువచ్చారు.ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బురిడి వాసుదేవరావు మాట్లాడుతూ 1987లో జాతీయ రహదారిని ఆనుకుని బీసీ కాలనీ ఏర్పడిందన్నారు. జాతీయ రహదారికి వెళ్లేందుకు 60 అడుగుల రహదారి అవసరం కాగా రంగరాజు ఆక్రమణలతో కేవలం 8 అడుగుల రహదారి మాత్రమే ఇస్తానని చెబుతున్నారని వారు ఆరోపిస్తున్నారు. ఇరిగేషన్ భూములు ఆక్రమించుకుని షెడ్లు నిర్మించారని, అక్రమంగా చెరువు తవ్వించి చుట్టూ కరెంటు పనులు చేపట్టడంతో నాటి అధికారులు అడ్డుకున్నారని తెలిపారు. అధికారులు రంగరాజు జోలికి వెళ్లకుండా రహదారి కబ్జాను ప్రోత్సహిస్తున్నట్లున్నారని ఆరోపించారు. అనంతరం గోపాలన్ మాట్లాడుతూ గణపవరం రహదారి పొడవునా రొయ్యల వలువు కేంద్రాల యజమానులు యథేచ్ఛగా డ్రెయినేజ్ భూములు ఆక్రమించుకున్నారని వారి జోలికి ఎందుకు వెళ్లడం లేదు? అని ప్రశ్నించారు. బడాబాబులకు అండగా నిలిచి చిరు వ్యాపారులపై ప్రతాపం చూపిస్తున్న ఎమ్మెల్యే రఘురామకృష్ణంరాజు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని ప్రజాసంఘాల రాష్ట్ర నాయకుడు రాము హెచ్చరించారు.

గుడి వద్ద జనసేన సభ ప్రసార స్క్రీన్



ఆలయ ప్రధాన ద్వారం వద్ద ఏర్పాటు చేసిన ప్రసార స్క్రీన్

ఏలూరు (ఆర్ఆర్‌పేట): జనసేన పార్టీ ఆవిర్భావ సభకు సంబంధించిన ప్రత్యక్షంగా ప్రసారం చేయడానికి స్థానిక రామచంద్రరావు పేట శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానాన్ని వినియోగించుకోవడం సిగ్గుచేటని వైఎస్సార్ సీపీ ఏలూరు నియోజకవర్గ ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు శివ రావు ఒక ప్రకటనలో ఖండించారు. జనసేన ఆవిర్భావ సభ ప్రత్యక్ష ప్రసారానికి సంబంధించిన స్క్రీన్‌ను వేంకటేశ్వర స్వామి దేవస్థానం ప్రధాన ద్వారం వద్ద ఏర్పాటు చేసి భక్తుల మనోభావాలను తుంగలో తొక్కారని, ప్రశాంతంగా దేవుని దర్శనానికి వచ్చే భక్తులకు మానసిక ప్రశాంతతను దూరం చేయడం ఏ మేరకు సబబని ప్రశ్నించారు. కాగా ఈ విషయాన్ని పలు హిందూ సంఘాల నాయకులు సైతం ఖండించారు. బడి దగ్గర మద్యం, గుడి దగ్గర రాజకీయాలు చేయడం ఒక్క కూటమి నాయకులకే చెల్లిందన్నారు.

బాస్కెట్‌బాల్ పోటీలకు ఐదుగురి ఎంపిక

ఏలూరు (ఆర్ఆర్‌పేట): జాతీయస్థాయి బాస్కెట్‌బాల్ టోర్నమెంట్‌కు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తరఫున పాల్గొనే జట్టుకు ఏలూరుకు చెందిన ఐదుగురు క్రీడాకారిణులు ఎంపికయ్యారని బాస్కెట్ బాల్ జిల్లా అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు కె.కృష్ణారెడ్డి, గవ్వ శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల విజయవాడలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ చూపడంతో జాతీయ జట్టుకు ఎంపిక చేశారని తెలిపారు. ఈ జట్టులో ఏలూరుకు చెందిన బీ. లీలావతి, ఏ. టాలీ అనిత, జి.నాగదేవి, పి.వినయశ్రీ, పాలకొల్లుకు చెందిన ఆర్.మహతి ఎంపికయ్యారని తెలిపారు. వీరు ఈ నెల 18 నుంచి 24 వరకూ అస్సాంలోని గౌహతిలో జాతీయ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

సైబర్ పోలీసులను ఆశ్రయించిన బియ్యం వ్యాపారి

ఆకివీడు: స్థానిక కూరగాయల మార్కెట్‌వద్ద బియ్యం వ్యాపారి గంటా శ్రీరామ్మూర్తి(తాతారావు) సెల్‌నుండి రూ. 98 వేలు కాజేసిన సైబర్ నేరంపై సైబర్ పోలీసులు కేసు నమోదు చేసినట్లు స్థానిక పోలీసులు శుక్రవారం తెలిపారు. బియ్యం కొనుగోలు చేసేందుకు శ్రీరామ్మూర్తి దుకాణం వద్దకు వచ్చిన ఓ వ్యక్తి తన వద్ద సొమ్ములేదని, తన సోదరుడికి రూ. 1 ఫోన్‌పే చేస్తే తిరిగి మీ నెంబర్‌కు బియ్యం సొమ్ము చెల్లిస్తారని చెప్పడంతో తాతారావు ఫోన్ పే చేయగా, రూపాయి జమ అవ్వలేదని రూ.10 చేయమన్నాడు. మళ్లీ పది రూపాయలు ఫోన్‌పే చేయగా, ఆ వ్యక్తి బియ్యం కట్ట తీసుకువెళ్లేందుకు మోటారు సైకిల్ తీసుకువస్తానని వెళ్లి తిరిగి రాలేదు. దీంతో అనుమానం వచ్చి ఫోన్‌పే ద్వారా అకౌంట్ చెక్ చేసుకోగా రూ. 98 వేలు ట్రాన్స్‌ఫర్ అయినట్టు గుర్తించాడు. వెంటనే సైబర్ సెల్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వడంతో సైబర్ పోలీసులు రంగప్రవేశం చేసి ఫోన్‌పే పొందిన నెంబర్‌ను గుర్తించారు. కేసు నమోదు చేసి దర్యప్తు కోసం కేసును ఆకివీడు పోలీసులకు అప్పగించనున్నారు.

ఐరన్ ప్లేట్ పడి కూలీ మృతి

పెంటపాడు: ప్రత్తిపాడులో ఓ పేపర్‌మిల్లులో పని చేస్తూ ప్రమాదవశాత్తూ ఐరన్ ప్లేట్ మీద పడి ఒక వ్యక్తి మృతి చెందాడు. పెంటపాడు ఎస్సై స్వామి తెలిపిన వివరాల ప్రకారం తాడేపల్లిగూడెంలోని యాగర్లపల్లికి చెందిన షేక్ మస్తాన్ (38) పట్టణంలో పాత ఇనుము దుకాణంలో పని చేస్తున్నాడు. అయితే ఈనెల 13న పెంటపాడు మండలం ప్రత్తిపాడులోని ఓ పేపర్ మిల్లులో ఇనుప వస్తువులను తొలగించేందుకు వెళ్లాడు. పని చేస్తున్న క్రమంలో మస్తాన్‌పై బరువైన ఐరన్‌ప్లేట్ పడటంతో దాని కింద పడి మృతి చెందాడు. ప్రమాదం జరిగిన సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో విషయం శుక్రవారం మధ్యాహ్నం వరకు ఎవరికీ తెలియరాలేదు. సమాచారం తెలుసుకున్న ఎస్సై అక్కడకు చేరుకొని వివరాలు సేకరించి అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తాడేపల్లిగూడెం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అక్రమ కలప పట్టివేత



అటవీశాఖాధికారులు పట్టుకున్న అక్రమ కలప

కుక్కునూరు: అక్రమంగా దాచి ఉంచిన ఇరుగుడు చావ (రోజ్ వుడ్) కలపను శుక్రవారం కుక్కునూరు అటవీశాఖాధికారులు పట్టుకున్నారు. కుక్కునూరు అటవీశాఖ రేంజ్ అధికారి కె.కృష్ణకుమారి చెప్పిన వివరాల ప్రకారం మండలంలోని బెస్తగూడెం గ్రామ శివారులో రోజ్ వుడ్ కలపను అక్రమంగా దాచి ఉంచారన్న సమాచారం మేరకు దాడి చేసినట్టు చెప్పారు.ఈ దాడులలో 52 సైజల రోజ్ వుడ్‌ను స్వాధీనం చేసుకుని అటవీశాఖ కార్యాలయానికి తరలించామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

బంగారం దోచికెళ్లిన దొంగ అరెస్ట్

పెనుగొండ: కరుగోరుమిల్లిలో వృద్ధ దంపతులపై దాడి చేసి బంగారం దోచుకెళ్లిన దొంగలను అరెస్ట్ చేసినట్లు ఆచంట ఎస్సై కె.వెంకటరమణ శుక్రవారం విలేకరులకు తెలిపారు. ఈ నెల 2న రాత్రి సమయంలో కరుగోరుమిల్లికి చెందిన వడ్లవన్నాటి భాస్కరరావు, వెంకట లక్ష్మి దంపతులపై దాడి చేసి వారి వద్ద నుంచి రూ. 9 లక్షల విలువైన బంగారు ఆభరణాలు దోచుకెళ్లడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేయగా కరుగోరుమిల్లికి చెందిన కొండేటి నాగరాజుతో పాటు, పెనుమంట్ర మండలం వెలగలవారిపాలేనికి చెందిన కర్రి చంద్రారెడ్డి, నెల్లూరుకు చెందిర షేక్ ఫక్రుద్దీన్, అదే జిల్లాకు చెందిన అర్జున్ జ్ఞాన ప్రకాష్, లింగుమేరీ రాంబాబు ఈ చోరీకి పాల్పడినట్లు గుర్తించామన్నారు. రాజమండ్రి పోలీసుల సహకారంతో శుక్రవారం లభించిన సమాచారంతో కొండేటి నాగరాజును అరెస్ట్ చేశామని వివరించారు. ఈ కేసులో ఆభరణాలు రికవరీ చేయాల్సి ఉందని తెలిపారు.

విద్యుత్ షాక్‌తో మహిళ మృతి

టి.నరసాపురం: విద్యుత్ షాక్‌తో గ్రామానికి చెందిన ఓ మహిళ మృతి చెందింది. వివరాల ప్రకారం టి.నరసాపురానికి చెందిన కుప్పల లక్ష్మి (35) శుక్రవారం ఓ రైతు పొలంలో కోకో కాయలు కోసేందుకు వెళ్లింది. కోకో కాయలు కోస్తుండగా, సమీపంలోని విద్యుత్ వైరుకు కాయలు కోస్తున్న గెడ తగలడంతో లక్ష్మి విద్యుత్ షాక్‌కు గురైంది. దీంతో లక్ష్మిని చింతలపూడి ప్రభుత్వాసుపత్రికి తరలించగా, పరీక్షించిన వైద్యులు ఆమె మృతిచెందినట్లు తెలిపారు. అయితే భార్య మృతి వార్త తట్టుకోలేని భర్త నారాయణస్వామి అస్వస్థతకు గురికావడంతో, బంధువులు అతనిని ఏలూరు వైద్యశాలకు తరలించారు. కాగా వీరికి ఇద్దరు సంతానం ఉన్నారు. అయితే ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేయాల్సి ఉంది.

గుండుగొలను వంతెన నిర్మాణం ప్రశ్నార్థకం

- వంతెన శ్లాబ్ వేయవద్దని కేంద్ర జలరవాణా శాఖ ఆదేశాలు
- అర్ధాంతరంగా నిలిచిన పనులు




గుండుగొలను వంతెనకు శ్లాబ్ వేయకుండా నిలిచిన పనులు

భీమడోలు: గోదావరి కాలువపై గుండుగొలను వద్ద నిర్మిస్తున్న వంతెన నిర్మాణ పనులు నిలిపివేయాలని రాజమండ్రి కేంద్ర జల రవాణా శాఖ(ఇన్‌ల్యాండ్ వాటర్ ట్రాన్స్‌పోర్ట్ ఆఫ్ ఇండియా) ఆదేశించింది. దీంతో చివరి దశలో శ్లాబ్ వేసేందుకు సిద్ధంగా ఉన్న వంతెన అర్ధాంతరంగా నిలిచిపోయింది. కాలువపై వంతెన నిర్మాణం చేసే తరుణంలో కేంద్ర జలరవాణా శాఖ నుంచి నేషనల్ హైవే అథారిటీ సంస్థ కాంట్రాక్టర్ అనుమతులు తీసుకోవాల్సి ఉంది. అయితే మూడేళ్లుగా ఈ వంతెన నిర్మాణానికి అవసరమైన వివిధ శాఖల అనుమతులు తీసుకోకుండా కాంట్రాక్టర్, సంబంధిత అధికారులు కాలాయాపన చేశారు. తాజాగా వంతెన పనులు శ్లాబ్ దశకు రావడంతో కేంద్ర జలరవాణా శాఖ వంతెన పనులు ఆపాలని లిఖిత పూర్వక ఆదేశాలు జారీ చేసింది.

ఎత్తు తగ్గడం వల్లే

వాస్తవానికి జాతీయ రహదారికి 11 మీటర్ల ఎత్తులో వంతెన నిర్మాణం జరగాల్సి ఉంది. కానీ కేవలం 5 మీటర్ల ఎత్తు ఉండడంతో ఆ శాఖ అభ్యంతరం వ్యక్తం చేసింది. భవిష్యత్‌లో గోదావరి కాలువలో జల రవాణా శాఖ చేసే క్రమంలో వివిధ స్టీమర్లు, పడవలు, ఓడలు రవాణాకు ఈ వంతెన అడ్డంకిగా మారుతుందని పేర్కొంది. తక్షణమే నిలిపివేయాలని ఆ శాఖ స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. దీనితో సమస్య మొదటికొచ్చింది. దీనితో పలు మండలాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు.



ఐరన్ ఊసలు ఊడి ప్రమాదకరంగా మారిన బ్రెయిలీ వంతెన

రెండున్నరేళ్ల క్రితం కూలిన వంతెన


బ్రిటిష్ హాయంలో గుండుగొలను వద్ద నిర్మించిన వంతెన శిథిలావస్థకు చేరడంతో రెండున్నరేళ్ల కితం కూలిపోయింది. నిత్యం రద్దీగా ఈ వంతెనపై వాహనాల రాకపోకలు స్తంభించాయి. నిత్యం భీమడోలు, దెందులూరు, ఏలూరు రూరల్, కైకలూరు మండలాల నుంచి రాకపోకలు సాగించే వేలాది మంది ప్రజలు, రైతులు, ఉద్యోగులు, విద్యార్థులు, కూలీలు, భక్తుల ప్రయాణానికి తీవ్ర ఇబ్బందులు పడ్డారు దీనితో అప్పటి ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు ఈ సమస్యను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకుని వెళ్లి రూ.4 కోట్ల నిధులు మంజూరు చేయించారు. నేషనల్ హైవే అథారిటి సంస్థ 2023 జూన్‌లో కూలిన వంతెన స్థానంలో కొత్త వంతెన నిర్మాణ పనులు ప్రారంభించింది. వైఎస్సార్ సీపీ హయాంలో 60 శాతం పనులు పూర్తి అయ్యాయి. అయితే మిగిలిన 40 పనులును కూటమి సర్కార్ రాగానే పనులు చేపట్టగా అడుగడుగునా ఆటంకాలు ఏర్పడుతూనే ఉన్నాయి. అయితే ప్రస్తుతం శ్లాబ్ వేయాల్సి ఉంది.

బెయిలీ వంతెనపై భయం భయంగా..

గుండుగొలను వద్ద శాశ్వత వంతెన నిర్మాణం పూర్తయ్యే వరకు నిర్మించిన బ్రెయిలీ వంతెనపై ప్రజలు భయం భయంగా ప్రయాణాలు సాగిస్తున్నారు. ఈ వంతెన వ్యవధి రెండేళ్లు అని ఆర్అండ్‌బీ అధికారులు బెయిలీ వంతెన ప్రారంభోత్సవంలో తెలిపారు. ఈ ఏడాది నవంబర్‌కు గడువు ముగుస్తుంది. అయితే ఈ వంతెనపై భారీ వాహనాలు రాకపోకలు సాగించడంతో బిక్కుబిక్కుమంటూ ప్రయాణం చేయాల్సి వస్తుందని ప్రజలు వాపోతున్నారు.

క్లుప్తంగా

వాసవీ అమ్మవారికి పంచామృతాభిషేకాలు


విశేష అలంకరణలో వాసవీ అమ్మవారు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలో వాసవీ కన్యకా పరమేశ్వరీ అమ్మవారికి శుక్రవారం పంచామృతాలతో, ఫల రసాలు, సుగంధ ద్రవ్యాలు, పసుపు కుంకుమలతో విశేష అభిషేకాలు జరిగాయి. ఆర్యవైశ్య సంఘం, వాసవి సభ్యులు, వాసవి మహిళలు పాల్గొన్నారు.

శ్రీ చింతామణిదేవి అమ్మవారికి పూజలు
స్థానిక రామచంద్రరావుపేటలోని శ్రీ కృష్ణ యోగధ్యాన మందిరంలోని శ్రీ చింతామణి అమ్మవారికి, శ్రీ కృష్ణపరమాత్మకు పంచామృత అభిషేకాలు, సహస్ర నామ పూజలు, సామూహిక సహస్ర కుంకుమ పూజలు జరిగాయి. మందిర కార్యదర్శి ఇందుకూరి మోహన్‌రాజులు పర్యవేక్షించారు,

దుర్గమ్మకు విశేష పూజలు


ప్రత్తిపాడు వై. జంక్షన్‌లో పూజలందుకొంటున్న కనకదుర్గమ్మ

పెంటపాడు: మండలంలో ప్రత్తిపాడు వై.జంక్షన్‌లో కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయంలో శుక్రవారం బహుళ పాడ్యమి పురస్కరించుకొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా పూలతో అలంకరించారు. ఆలయ ఈవో యాళ్ల శ్రీధర్ ఆధ్వర్యంలో అర్చకులు కొత్తలంక శివసత్యనారాయణ, ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి ప్రసాదాన్ని ఈ సందర్భంగా పంపిణీ చేశారు. తాడిపర్తి వీరాస్వామి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

అయ్యప్పస్వామికి అన్నాభిషేకం


అత్తిలి అయ్యప్పస్వామికి అన్నాభిషేకం నిర్వహిస్తున్న దృశ్యం

అత్తిలి: అయ్యప్పస్వామి జన్మదినోత్సవం సందర్భంగా శుక్రవారం అత్తిలి బాలాజీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో గల శ్రీఅయ్యప్పస్వామి వారికి 108 కిలోల అన్నాభిషేకం నిర్వహించారు. శ్రీధర్మశాస్త మూలమంత్రం హోమం, అష్టలక్ష్మి మూలమంత్ర హోమం జరిపారు. ఆలయ అర్చకులు వాడపల్లి సత్యనారాయణాచార్యులు, వల్లీ వెంకటేష్, సూర్యతేజ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరిపారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకున్నారు.

అయ్యప్పస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని పడాల శ్రీఅయ్యప్ప స్వామివారి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి జన్మనక్షత్రం కావడంతో అభిషేకాలు జరిపారు. స్వామివారిని దర్శించేందుకు భక్తులు విరివిగా తరలివచ్చారు. సాయంత్రం 18 మెట్లకు పూజలు జరిపారు. అయ్యప్ప సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

ఉద్యోగులు సంఘటితం కావాలి

భీమవరం (ప్రకాశంచౌక్): దళిత ఉద్యోగులు సంఘటితం కావాలని ఆంధ్రప్రదేశ్ ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డి.రత్న ప్రదీప్ అన్నారు. భీమవరం బీఆర్ అంబేద్కర్ భవనంలో ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా నూతన కమిటీ, భీమవరం మండల కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా కె.రాజ్ కిషోర్ (తహసీల్దార్), సెక్రటరీగా ఎస్.శ్రీకర్, వైస్ ప్రెసిడెంట్‌గా బి.జ్యోతి, ట్రెజరర్‌గా జి.కృష్ణమోహన్, మండల అధ్యక్షుడిగా వి.రాజేష్‌కుమార్, సెక్రటరీగా కె.గౌతమ్‌కుమార్, వైస్ ప్రెసిడెంట్‌గా పి.రాజేష్, ట్రెజరర్‌గా పి.సుధీర్ బాబు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో ఆర్.రాంబాబు, జి.మురళీకృష్ణ, కె.శ్రీనివాస్ రావు, కేసీ రాజు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న చిన్నారుల నాట్యం

పెనుగొండ: సిద్ధాంతంలో విజయ గోపాల స్వామి, మాధవ స్వామి వార్ల కల్యాణ మహోత్సవాలు సందర్భంగా చిన్నారుల భరత నాట్యం ఆకట్టుకొంది. గురువారం రాత్రి ఆరేళ్ల చిన్నారి కముజు నిహాన్సి భరత నాట్యం ప్రదర్శన, మిగిలిన చిన్నారుల సామూహిక నృత్యం వీక్షకులకు రంజింపజేశాయి. చిన్నారులను పలువురు అభినందించారు.

క్యారీ బ్యాగులు నిషేధించరూ..!

- యథేచ్ఛగా వినియోగం
- మచ్చుకైనా కానరాని 'స్వచ్ఛభారత్'

పెంటపాడు: ప్లాస్టిక్ క్యారీ బ్యాగుల నిషేదం అమలుకు నోచుకోవడం లేదు. పర్యావరణ కాలుష్యం తగ్గాలంటే ప్లాస్టిక్ క్యారీ బ్యాగ్‌ల వాడకాన్ని పూర్తిగా నిషేదించాల్సిన పరిస్థితి ఉంది. తాడేపల్లిగూడెం డివిజన్ పరిధిలోని పెంటపాడు ఆయా మండలాల్లో అన్ని గ్రామాల్లో ఆయా గ్రామ పంచాయతీలు ప్లాస్టిక్ క్యారీ బ్యాగులను నిషేదిస్తూ నిషేదాజ్ఞలు గత ఏడాది డిసెంబర్ నెలలో జారీచేశాయి. కానీ అమలు మాత్రం లోపభూయిష్టంగా ఉంది. ఏళ్ల క్రితమే ప్లాస్టిక్ నిషేదిస్తూ పంచాయతీ పాలకవర్గాలు తీర్మానం చేసినప్పటికీ అదికారుల్లో చిత్తశుద్ధి లోపించడంతో ఆశయం అభాసుపాలవుతోంది. ఒక్కొక్క నియోజవర్గ వర్గ పరిధిలో నాలుగు మండలాల్లోను రోజుకు ఒక అర టన్ను క్యారీ బ్యాగులు వినియోగిస్తున్నారని అంచనావేసినట్లు వ్యాపారులు చెబుతున్నారు. భూమి, నీరు, వాయువులు కలుషితమవుతుతాయి. భూగర్భజలాలు దెబ్బతిని, సారవంతమైన పంట భూములు నిస్సారమవుతాయి. ప్లాస్టిక్ వాడకం వల్ల ప్రమాదకర క్యాన్సర్ వ్యాపిస్తుంది. నాడీ వ్యవస్థతోపాటు ఎర్రరక్తకణాలు కాలేయం, మూత్ర పిండాలపై ప్రభావం చూపుతుంది. ప్లాస్టిక్ కాల్చితే వచ్చే లిక్విడ్ హైడ్రో కార్బన్ వాయువు వలన గాలి కలుషితమవుతుంది. పిల్లలు పలు రకాల లోపాలతో పుడతారు. క్యారీ బ్యాగుల్లో సిగమెంట్లు, పాస్టిసైజర్లు యాంటీ ఆక్సిడెంట్లు ఉండటం వలన వ్యాధుల బారిన పడుతున్నారు. ఇటీవల పంచాయతీ పరిధిలో ప్లాస్టిక్ వాడకాన్ని అరికట్టాలని ర్యాలీ నిర్వహించారు.


వాడి పడేసిన ప్లాస్టిక్ బాటిళ్లు


కె. పెంటపాడు పంచాయతీ డంపింగ్ యార్డులో ఇలా..

ముందస్తు జాగ్రత్తలు మేలు
నిత్యావసరాలకు జూట్, పేపరు, కాటన్ బ్యాగులను మాత్రమే ఉపయోగించాలి. ప్లాస్టిక్ అనర్థాలపై ప్రజల్లో విస్తృత ప్రచారం కల్పించాలి. పంచాయతీ అధికారులు ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహిస్తూ అపరాధ రుసుము విధించాలి. స్వచ్ఛంధ సేవా సంస్థలు ప్రత్యేక చొరవ తీసుకోవాలి. దుకాణదారుల్లో ప్లాస్టిక్ క్యారీ బ్యాగుల వాడకం వల్ల కలిగే అనార్థాలపై అవగాహన కల్గించాలి. ముఖ్యంగా క్యారీ బ్యాగుల నిషేదంలో ప్రజలను భాగస్వామలు చేయాలి.

ప్లాస్టిక్ వినియోగం ప్రమాదకరం

ప్లాస్టిక్ వినియోగం మానవాళితో పాటు జీవాలకు ప్రమాదకరమే. ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ కవర్లకు ప్రత్యామ్నాయ మార్గలను అన్వేషించాలి. జనపనారతో సమస్యలు రావని గమనించాలి. క్యారీ బ్యాగ్ వినియోగించడవ వల్ల తరచూ రోగాల బారిన పడే అవకాశాలు ఉన్నాయి. -

– డాక్టర్ తోట రాజేష్, పెంటపాడు పీహెచ్‌సీ, పెంటపాడు

చర్యలు తీసుకుంటాం

ప్లాస్టిక్ క్యారీ బ్యాగులను వాడరాదంటూ గతంలో గ్రామంలో మైక్ ప్రచారం చేయించాం. అన్ని సచివాలయాలకు ఆదేశాలు జారీ చేశాం. వ్యాపారులకు అవగాహన కల్పించాం. ప్లాస్టిక్ క్యారీ బ్యాగుల వినియోగం వల్ల వచ్చే అనర్థాలను వివరించాం. త్వరలో ప్లాస్టిక్ వాడకాలను తగ్గించకుంటే చర్యలు తీసుకుంటాం

– సీహెచ్.బాలాజీ, ఎంపీడీవో పెంటపాడు

మహిళల సమాన హక్కుల కోసం కృషి చేయాలి


సదస్సులో పాల్గొన్న ప్రిన్సిపల్ సివిల్ జడ్జి ఎస్.సూర్య కిరణ్ శ్రీ, మహిళా సభ్యులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): దేశంలో సగంవంతు ఉన్న మహిళలు తమ హక్కుల సాధన కోసం కృషి చేయాల్సిన బాధ్యత వారిపై ఉందని ప్రిన్సిపల్ సివిల్ జడ్జి ఎస్.సూర్య కిరణ్ శ్రీ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని ఏపీ మహిళా సమాఖ్య (ఎన్ఎఫ్ఐడబ్ల్యూ) పిలుపు మేరకు శుక్రవారం పట్టణంలో ఏపీ మహిళా సమాఖ్య తాడేపల్లిగూడెం శాఖ ఆధ్వర్యంలో జిల్లా సదస్సు జరిగింది. కిరణ్ శ్రీ మాట్లాడుతూ లింగ సమానత్వ సూచికలు దేశంలో 103, 193 గా ఉందని, సమానత్వం సాధించడానికి చాలా సంవత్సరాలు పట్టవచ్చు అన్నారు. అభ్యుదయ భావాలు కలిగిన మహిళలు సమాన విద్య, ఉద్యోగం, అన్ని రంగాల్లో సమానత్వం కోసం కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఏపీ మహిళా సమాఖ్య ప్రధాన కార్యదర్శి పెన్మత్స దుర్గా భవాని మాట్లాడుతూ మహిళా సాధికారత దిశగాను, సమానత్వం కోసం మహిళలు హక్కులు సాధన కోసం నిరంతరం పోరాటం చేద్దామన్నారు. అంతర్జాతీయ మహిళా శిల్పి దేవికా రాణి ఉడయార్ మాట్లాడుతూ దేశంలోని మహిళలకు అన్ని విధాలుగా భద్రత కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ వైద్యురాలు ఎర్ర మాధురి, మహిళా సభ్యులు వడ్డాది మేరీ, ఘాగరాజు, నాగలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

వైభవోపేతంగా మదనగోపాల స్వామి చక్రస్నానం

అత్తిలి: మండలంలోని బల్లిపాడు గ్రామంలో రుక్మిణీసత్యభామా సమేత మదనగోపాలస్వామి కల్యాణ మహోత్సవాలలో భాగంగా శుక్రవారం స్వామివారికి చక్రస్నాన కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామివారి ఆలయంలో హోమ పూజలు చేశారు. మహిళా భక్తులు రోలులో పసుపుకొమ్ములను దంచి పసుపు చేసి స్వామివారి ఉత్సవమూర్తులకు పూసి పూజాదికాలను నర్సాపురంకు చెందిన వేదపండితులు పెద్దింటి అనిల్‌కుమార్‌ఆచార్యులు ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా జరిపారు. శ్రీస్వామివారి చక్రాన్ని పల్లకీలో ఉంచి మేళతాళాల నడుమ కొలనువద్దకు చేరుకుని చక్రస్నానం చేయించారు. భక్తుల శిరస్సుపై శ్రీస్వామివారి చక్రాన్ని ఉంచి స్నానాలు ఆచరించారు. పెద్ద సంఖ్యలో భక్తులు ఈచక్రస్నానంలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో ఎల్ లోకనాథ్ శ్రీనివాస్, ఉత్సవ కమిటీ సభ్యులు గారపాటి వెంకట సుబ్బారావు, గారపాటి శివకృష్ణ అశోక్, బుద్దాల భాస్కరరావు, ఆకుల వెంకటేశ్వరరావు, తోట నాగ వెంకట శివ గణేష్, ప్రగడ నాగ వెంకట శివదుర్గ గణేష్, గూనా పవన్ మణికంఠ గోపాలకృష్ణ, గునుపూడి నరేష్, పెచ్చెట్టి సత్యనారాయణ, కొల్లి సంతోషం, కోటిచుక్కల పోతురాజు తదితరులు పాల్గొన్నారు.


అత్తిలి మండలం బల్లిపాడులో కొలనులో చక్రస్నానాలు ఆచరిస్తున్న భక్తులు

లయన్స్ బెస్ట్ జోన్ చైర్‌పర్సన్‌గా పేరిచర్ల

తాడేపల్లిగూడెం (టీఓసీ): లయన్స్‌క్లబ్ డైమండ్స్ సభ్యులకు పలు ఇంటర్నేషనల్ అవార్డులు వచ్చాయి. అలంపురం జయా గార్డెన్స్‌లో అవార్డులు ఫంక్షన్ జరిగింది. జిల్లా బెస్ట్ ఆల్ రౌండర్ లయన్స్‌గా బెస్ట్ జోన్ చైర్ పర్సన్‌గా పేరిచర్ల మురళీకృష్ణంరాజు ఎంపికయ్యారు. బెస్ట్ క్లబ్, బెస్ట్ అధ్యక్షుడు, బెస్ట్ సెక్రటరీ తదితర అవార్డులను ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ విజయ్‌కుమార్ రాజు, మాజీ సీబీఐ అధికారి జేడీ లక్ష్మీనారాయణ, జస్టిస్ ఆకుల వెంకట శేష సాయి, మల్టీపుల్ చైర్ పర్సన్ శ్రీశాంతిలు అవార్డులను అందజేశారు. డైమండ్స్ అధ్యక్షుడు కొప్పిసెట్టి రమణయ్య, సెక్రటరీ మద్దుకూరి మెహర్ ప్రసాద్, డాక్టర్ కేతకమల, బడుగు చంద్రశేఖర్, చిక్కాల అంబికా, సుస్మిత, కరిబండి రామకృష్ణలు వ్యక్తిగత అవార్డు అందుకున్నారు. గవర్నర్ కాకరాల వేణుబాబు, గట్టిం మాణిక్యాలరావు, ఎస్‌వీఎస్ పాపారావు నాయుడు, పదం కుమార్ గుప్తా, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


బెస్ట్ జోన్ చైర్‌పర్సన్ అవార్డు అందుకుంటున్న పేరిచర్ల మురళీ కృష్ణంరాజు

సత్యసాయి సేవా సమితి సేవలు అభినందనీయం

తాడేపల్లిగూడెం (టీఓసీ): సత్యసాయి సేవా సమితి సేవలు అభినందనీయమని పలువురు వక్తలు కొనియాడారు. శ్రీ సత్యసాయిబాబా శత జయంతి కార్యక్రమాలలో భాగంగా శ్రీ సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో రాజమండ్రి వేమగిరి శ్రీ పరమహంస నేత్ర వైద్యశాల సౌజన్యంతో ఉచిత కంటి వైద్య శిబిరం జరిగింది. 105 మందికి కంటి పరీక్షలు చేశారు. 25 మందికి కళ్లజోడ్లు వేసేందుకు నిర్ణయించారు. 29 మందికి ఆపరేషన్లు నిమిత్తం వేమగిరి పంపారు. కన్వీనర్ ఎం.ఎన్.ఎస్.కే జనార్దన రావు మాట్లాడుతూ ప్రతి నెల 2వ తేదీన గురువారం డీఎస్ చెరువు వద్ద సత్యసాయి మందిరంలో ఉచిత కంటి వైద్య శిబిరం జరుగుతుందని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సత్యసాయి మందిరంలో శుక్రవారం ఉదయం నుంచి సత్యసాయికు పూజలు జరిగాయి. సాయి పల్లకి సేవ జరిగింది. భక్తులు విశేషంగా పాల్గొన్నారు. విష్ణుమూర్తి, శోభనాద్రిరావు, నవీన్‌బాబా, జంధ్యాల నాగేశ్వరరావు, పద్మావతి, మహిళా సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


సత్యసాయి మందిరం ఆధ్వర్యంలో పల్లకి సేవ

విశాఖ ఉక్కు పరిశ్రమకు సొంత గనులు కేటాయించాలి

తణుకు అర్బన్: విశాఖ ఉక్కు పరిశ్రమకు సొంత గనులు కేటాయించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పీవీ. ప్రతాప్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక నరేంద్ర సెంటర్‌లో సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గత పది సంవత్సరాలుగా విశాఖ ఉక్కు పరిశ్రమ కుదిరితే అమ్మకం లేదంటే ప్రైవేటీకరణ చేయడానికి కేంద్ర ప్రభుత్వం తీవ్ర ప్రయత్నం చేస్తుందని విమర్శించారు. విశాఖ ఉక్కు ఆంధ్రుల ఆత్మ గౌరవానికి ప్రతీక అని పరిశ్రమను కాపాడుకునేందుకు 32మంది యువత బలి అయ్యారని పేర్కొన్నారు. ఎన్నో త్యాగాలు, పోరాటాల ద్వారా వచ్చిన ఉక్కు పరిశ్రమను ఆంధ్రప్రదేశ్‌లో లేకుండా చేస్తామంటే తెలుగు ప్రజలు చూస్తూ ఊరుకోరని అన్నారు. విశాఖ ఉక్కు పరిశ్రమ తర్వాత స్థాపించిన కార్పొరేట్ స్టీల్ ప్లాంట్‌లకు వెంటనే గనులు కేటాయించినప్పుడు, ప్రభుత్వం అధీనంలో ఉన్న విశాఖ ఉక్కుకి ఎందుకు కేటాయించారని ప్రశ్నించారు. గత 400పైన రోజులుగా ఉక్కు కార్మికులు చేస్తున్న ఆందోళనల నేపథ్యంలో ప్రైవేటీకరణ చేసేందుకు కేంద్ర ప్రభుత్వానికి ధైర్యం చాలడం లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి గుబ్బల గోపి, పీఎల్ నరసింహారావు, గోవిందరావు, ఆచంటి శ్రీరామమూర్తి, జి. వెంకటేశ్వరరావు, కిషోర్, రమణ, వి.తరుణ్ తేజ్, శ్రీహర్ష, పి. రాజా తదితరులు పాల్గొన్నారు.



తణుకు నరేంద్ర సెంటర్‌లో నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు ప్రతాప్ తదితరులు

విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను పరిరక్షించాలి
తాడేపల్లిగూడెం రూరల్: విశాఖ స్టీల్ ప్లాంట్‌ను పరిరక్షిస్తామని కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీని అమలు చేయాలని ఇఫ్టూ ఉమ్మడి జిల్లా కార్యదర్శి మామిడి దానవరప్రసాద్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం మండలంలోని పెదతాడేపల్లి గ్రామంలో ఇఫ్టూ రాష్ట్ర కమిటి ముద్రించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. సందర్భంగా మామిడి దానవరప్రసాద్ మాట్లాడుతూ విశాఖ స్టీల్ ప్లాంట్‌కు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ప్యాకేజీ నిధులు కేవలం అప్పులు తీర్చడానికే ఉపయోగించాలని, స్టీల్‌ప్లాంట్ కార్మికుల జీతాలు, ముడి సరుకు కొనడానికి, ప్లాంట్ నడపడానికి కావలసిన పరికరాలను కొనడానికి వినియోగించరాదని పేర్కొందన్నారు. ఇచ్చిన నిధులతో అప్పులు తీర్చి ప్రైవేట్ వారికి అప్పులు లేని ప్లాంట్‌ను దారాదత్తం చేయాలనే కుట్ర కనిపిస్తుందన్నారు. స్టీల్ ప్లాంట్‌కు సొంత గనులు ఎందుకు కేటాయించలేదో ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. ఇప్పటికైనా కార్మికులంతా విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు కలిసికట్టుగా సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. బి.వెంకట్రావు, రామిశెట్టి నాగేశ్వరరావు, నలగంటి నాగేశ్వరరావు పాల్గొన్నారు.


పెదతాడేపల్లి గ్రామంలో ఇఫ్టూ కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

ఘనంగా అన్నసమారాధన

పెంటపాడు: మండలంలోని కె. పెంటపాడు గ్రామ దేవత పెంట్లమ్మ అమ్మవారి పౌర్ణమి పూజల్లో భాగంగా శుక్రవారం గ్రామంలో భారీ అన్నసమారాధన నిర్వహించారు. ఆలయ కమిటీ పంతం శేఖర్, గ్రామస్తుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో 3 వేల మంది భక్తులు అమ్మవారి ప్రసాదం స్వీకరించారు. ఈ సందర్భంగా పౌర్ణమి పురస్కరించుకొని అమ్మవారికి కుంకుమపూజలు చేశారు. మహిళలు సామూహిక భజనలు చేశారు. ఈ కార్యక్రమంలో పలు గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించి ప్రత్యేక పూజలు చేసారు.

పక్కా డ్రెయిన్ నిర్మించండి

నరసాపురం : స్థానిక రూరల్ పోలీస్ స్టేషన్ రోడ్డులో ఉన్న డ్రెయిన్ శిథిలమైంది. ఇది రూరల్ పోలీస్ స్టేషన్ అవతల కొద్ది దూరంలో మెయిన్ డ్రెయిన్‌లో కలుస్తుంది. 15 సంవత్సరాల క్రితం నిర్మించిన ఈ డ్రెయిన్‌లో మురుగు ముందుకు పారకపోవడంతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనిని పునర్నిర్మించాలని వారు మునిసిపల్ అధికారులను కోరుతున్నారు.

చిన్నపాటి నీటి నిల్వలే దోమ పుట్టుకకు ఆవాసాలు

తణుకు అర్బన్: మురుగుపారని డ్రెయిన్‌లలోని నీటి నిల్వలు దోమల ఉత్పత్తి స్థావరాలని సబ్ యూనిట్ ఆఫీసర్ గుడిమెట్ల వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం తణుకు మునిసిపాలిటీ పరిధిలోని టి.వేమవరం, డిఎల్‌కె రోడ్డు ప్రాంతాల్లో ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని ఆయన క్షేత్ర స్థాయిలో పరిశీలించి మాట్లాడారు. ఫ్రైడే డ్రైడే పాటించడం ద్వారా దోమ పుట్టుకకు చెక్ పెట్టాలని, తద్వారా దోమకాటు వ్యాధులను నిరోధించవచ్చని అన్నారు. ×స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ-ఆంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఇంటి పరిసరాల్లో, కార్యాలయాల్లో శుభ్రత పాటించడం ద్వారా సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నిర్మూలించడం, రీయూజబుల్ వస్తువులను వాడడంద్వారా ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసే భాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని వివరించారు. ఈకార్యక్రమంలో ఫైలేరియా కంట్రోల్ యూనిట్ సూపర్‌వైజర్ కె.సత్యన్నారాయణ, వార్డు హెల్త్ సెక్రెటరీలు కె.బేబీకుమారి, కె.మార్థమ్మ, కార్యకర్త ఎం.కుమారి పాల్గొన్నారు.


తణుకులో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

బ్యాంకు ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): దేశ ప్రజలంతా ఆనందంతో జరిపే హోలి పండుగ సందర్భంలో బ్యాంక్ ఉద్యోగులను ఐబీఏ, ప్రభుత్వ వర్గాలు వంచిం చిస్తున్నాయని బ్యాంక్ ఉద్యోగ సంఘాల నాయకులు సూర్యానారాయణ, ఎస్.ఎస్. ప్రసాద్‌లు ఆందోళన వ్యక్తం చేశారు. వక్తలు మాట్లాడుతూ బ్యాంకు యూనియన్లు తమ న్యాయమైన కోర్కెలు పరిష్కారం కోరుతూ నెల రోజులుగా ఆందోళన కార్యక్రమాలు చేస్తున్నట్లు చెప్పారు. పార్లమెంట్‌కు పెద్ద ప్రదర్శన జరిపామని, అయినప్పటికి ఐబీఏ, ప్రభుత్వానికి వినిపించడం లేదని, కన్పించడం లేదని విమర్శించారు. ప్రభుత్వ వర్గాలు కంటి తుడుపు చర్యలు చేపట్టి యూఎఫ్‌బీయూ సంప్రదింపులు పిలిచి అర్ధరహితమైన స్పష్టత లేని చర్చలు జరిపారని, పెన్షన్ రివిజన్‌పై ఏమి చర్చించారో స్పష్టత లేదన్నారు. ఆందోళన ఉధృతం చేయాలన్నారు. ఉద్యగుల ఐక్యతతో సమ్మెలోకి అందరు రావాలని పిలుపునిచ్చారు.

పది పరీక్షలకు విద్యార్థులు సిద్ధం

- పరీక్షలకు ఒక్కరోజే గడువు
- నూరు శాతం ఉత్తీర్ణతే లక్ష్యమంటున్న ఉపాధ్యాయులు
- అదనపు తరగతుల్లో రాటుదేలిన విద్యార్థులు
- నియోజకవర్గంలో 5528 మంది 10వ తరగతి విద్యార్థులు..
- ఈనెల 17 నుంచి పది పరీక్షలు మొదలు

తణుకు అర్బన్ : పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించేందుకు విద్యార్థులు పూర్తిస్థాయిలో కృషి చేస్తున్నారు. ప్రతి పాఠశాలల్లోను విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు పదో తర గతి విద్యార్థులను తీర్చిదిద్దారు. ఈనెల 17 నుంచి 31వ తేదీ వరకు పదో తరగతి పరీక్షలకు ఇప్పటికే విద్యాశాఖాధికారులు అన్ని ఏర్పాట్లుచేయగా విద్యార్థులుకూడా పూర్తిస్థాయిలో సిద్ధమయ్యారు. పరీక్ష పేపర్లు కూడా ఇప్పటికే ఆయా పోలీస్‌స్టేషన్‌లకు వచ్చి ఉన్నాయి. మెరిట్ విద్యార్థులు మంచి మార్కులు సాధించేలా వెనుకబడిన విద్యార్థులు పాస్ మార్కులు సాధించేలా ఉపాధ్యాయులు పూర్తి ప్రణాళికలు రూపొందించి విద్యార్థులను సిద్ధం చేశారు. ఇందుకు సంబంధించి ఉదయం, సాయంత్రం అదనపు సమయాలు కేటాయించి సానపట్టగా రెండు రోజుల్లో పరీక్ష కాగా విద్యార్థులకు ఉపాధ్యాయులు ప్రత్యేక కౌన్సెలింగ్‌లు ఇస్తున్నారు. ధైర్యంగా ఉండాలని, ఎటువంటి ఆలోచనలకు తావులేకుండా కేవలం పుస్తకాలు, పరీక్ష పేపరుపైనే దృష్టిపెట్టాలని సూచించారు. తణుకు నియోజకవర్గంలోని తణుకు మునిసిపాలిటి, తణుకు, ఇరగవరం, అత్తిలి మండలాల్లో ప్రభుత్వ, ప్రైవేటు 60 పాఠశాలలకు సెంబంధించి 5528మంది విద్యార్థులు ఈ ఏడాది పదోతరగతి పరీక్షలకు హాజరుకానున్నారు.


తణుకు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో అదనపు తరగతి సమయంలో చదువుతున్న విద్యార్థులు

తణుకు నియోజకవర్గంలో పది విద్యార్థుల వివరాలిలా..

	తణుకు	ఇరగవరం	అత్తిలి
ప్రభుత్వ పాఠశాలలు	11	7	10
ప్రైవేటు పాఠశాలలు	27	1	4
ప్రభుత్వ విద్యార్థుల సంఖ్య	2730	456	380
ప్రైవేటు విద్యార్థుల సంఖ్య	1803	26	133

పోటీతత్వంతో సాగుతున్న విద్యార్థులు
విద్యార్థులు ఒకరికంటే మరొకరు పబ్లిక్ పరీక్షలో మంచి మార్కులు సాధించేందుకు పోటీపడి పరీక్షలు రాసేందుకు పూర్తిస్థాయిలో సన్నద్ధమయ్యారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను నూరు శాతం ఉత్తీర్ణత సాధించేందుకు కృషిచేయగా, ప్రైవేటు పాఠశాలల్లో మాత్రం మంచి మార్కులు తెచ్చుకునేందుకు ఉపాధ్యాయులు తీవ్రంగా కృషి చేశారు. విద్యార్థులు ఏరకంగా సిద్ధమయ్యారో తెలుసుకునేందుకు ప్రతిరోజూ పరీక్షలు నిర్వహిస్తున్నారు.


తణుకు జాస్తి సీతామహాలక్ష్మి జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో చదువుకుంటున్న పది విద్యార్థులు


తణుకు ఏకేటీపీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పరీక్ష రాస్తున్న పది విద్యార్థులు